ఈనాడు
epaper.eenadu.net

# మెట్రో ప్రయాణికులు




**ప్రయాణికుల ఆదరణతో హైదరాబాద్ మెట్రో రైలు సరికొత్త మైలురాయిని చేరుకుంది. సోమవారం 5.10 లక్షల మంది ప్రయాణించారు. మెట్రోరైలు ప్రారంభం నుంచి ఇదే ఒకరోజు అత్యధికం. ఇందులో సగానికిపైగా ప్రయాణికులు మియాపూర్-ఎల్బీనగర్ కారిడార్‌లోనే ప్రయాణించారు. నాగోల్-రాయదుర్గం మార్గంలోనూ 2.25 లక్షల మంది రాకపోకలు సాగించారు. ఈ రెండు కారిడార్లు ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి.**

- **సరికొత్త మైలురాయి**
- **ఒక్కరోజు రాకపోకల్లో రికార్డు**

హైదరాబాద్ వాసులకు అత్యంత కీలక ప్రజారవాణా సాధనాల్లో మెట్రోరైలు ఒకటి. ఈ ఆధునిక రవాణా వ్యవస్థను మొదటి నుంచి అన్నివర్గాలు ఆదరిస్తున్నాయి. ప్రస్తుతం మూడు కారిడార్లలో కలిపి 69.2 కి.మీ. మేర పరుగులు పెడుతోంది. ఐదున్నరేళ్ల క్రితం 2017 నవంబరు 29న హైదరాబాద్‌లో మెట్రోరైలు సేవలు ప్రారంభమైన తొలి రోజు నుంచి ప్రయాణికుల మన్ననలు అందుకుంటోంది. రెండున్నరేళ్లలోనే 2020 ఫిబ్రవరి నాటికి రోజువారీ ప్రయాణికుల సంఖ్య 4 లక్షలకు చేరింది. కొవిడ్ లాక్ డౌన్ విధించే నాటికి ఒకరోజు గరిష్ఠం 4.75 లక్షలుగా నమోదైంది. ఆ తర్వాత లాక్‌డౌన్ సమయంలో దాదాపు ఆరునెలలపాటు మెట్రోరైళ్లు డిపోలకే పరిమితమయ్యాయి. సెప్టెంబరు 2020లో తిరిగి సేవలు ప్రారంభం అయినా కొవిడ్ రెండోవేవ్, మూడో వేవ్ భయాలతో ఆదరణ అంతంతమాత్రంగానే లభించింది.

## మూడేళ్లకు పైగా

మెట్రో సేవలు పునఃప్రారంభం తర్వాత తొలి రెండు నెలలు ఆదరణ అంతంతమాత్రంగానే ఉన్నా.. ఆ తర్వాత ఒక్కసారిగా పుంజుకుంది. జనవరి 2021 నాటికి ప్రయాణికుల సంఖ్య 1.60 లక్షలకు, మార్చి 2022 నాటికి 3 లక్షలకు చేరింది. అదే ఏడాదిలో 4 లక్షల మైలురాయిని అందుకుంది.



| జులై 3న | |
|---|---|
| మొత్తం ప్రయాణికులు | 5.10 లక్షలు |
| మియాపూర్-ఎల్బీనగర్ (కారిడార్1) | 2.60 లక్షలు |
| నాగోల్-రాయదుర్గం (కారిడార్3) | 2.25 లక్షలు |
| జేబీఎస్-ఎంజీబీఎస్ (కారిడార్2) | 25వేలు |

**అత్యధిక మంది రాకపోకలు సాగించిన స్టేషన్లు**

| | |
|---|---|
| రాయదుర్గం | 32,000 |
| ఎల్బీనగర్ | 30,000 |
| అమీర్‌పేట | 29,000 |
| మియాపూర్ | 23,000 |

## ఐటీ ఉద్యోగులు, విద్యార్థులే ఎక్కువ..

మెట్రోలో నిత్యం ప్రయాణిస్తున్నవారిలో ఐటీ, ఐటీ ఆధారిత సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మొదటివరుసలో ఉన్నారు. వీరు రోజు సగటున 1.40 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. వీరి తర్వాతి స్థానం విద్యార్థులది. 1.20 లక్షల మంది విద్యార్థులు మెట్రోలో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు 40 కోట్ల ప్రయాణికులను మెట్రో గమ్యస్థానం చేర్చింది. '5 లక్షల మైలురాయిని చేరేందుకు ఆదరించిన ప్రయాణికులకు ధన్యవాదాలు. రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ నుంచి నిరంతర సహకారం, మద్దతుతోనే ఇది సాధ్యపడింది' అని ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ కేవీబీ రెడ్డి అన్నారు.

ఈనాడు, హైదరాబాద్